క్లుప్తంగా

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ



పరీక్ష సామగ్రి పంపిణీ చేస్తున్న డా.మొర్రిపిచ్చయ్యయాదవ్

గిద్దలూరు రూరల్: మండలంలోని పొదలకుంటపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు పాఠశాల హిందీ ఉపాధ్యాయుడు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడు యశ్వంత్ ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు డా.మొర్రిపిచ్చయ్యయాదవ్ శనివారం తన సొంత ఖర్చులతో పరీక్ష సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వరలక్ష్మమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థికి చేయూత మిత్ర మండలి సహాయం



విద్యార్థి సోదరుడికి ఆర్థిక సహాయం అందజేస్తున్న చేయూత సభ్యులు

బేస్తవారిపేట: మండలంలోని కొత్తపేట జెడ్పీ హైస్కూల్‌లో ఏడో తరగతి చదువుతున్న విద్యార్థి డీ వెంకట హర్షవర్ధన్‌రెడ్డి బోన్‌క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. చేయూత మిత్ర మండలి సభ్యులు రూ.5 వేల నగదును విద్యార్థి సోదరుడికి శనివారం అందజేశారు. హర్షవర్ధన్‌రెడ్డి ఎడమ కాలుకు బోన్ క్యాన్సర్ రావడంతో దినసరి కూలీలైన తల్లిదండ్రులు ఇప్పటికే రూ.2 లక్షలు ఖర్చుపెట్టారన్నారు. క్యాన్సర్ నివారణ పూర్తి చికిత్సకు రూ.6 నుంచి రూ.7 లక్షలు ఖర్చవుతుందని డాక్టర్లు తెలిపారన్నారు. సాయం కోసం తల్లిదండ్రులు ఎదురు చూస్తున్నట్లు తెలిపారు. దాతలు ఆదుకోవాలని చేయూత మిత్ర మండలి సభ్యులు కోరారు.

అర్బన్ కాలనీలో డ్రైనేజి కాల్వలు నిర్మించాలి

కంభం: అర్బన్‌కాలనీలో డ్రైనేజి కాలువలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని సీపీఎం జిల్లా నాయకుడు తోట తిరుపతిరావు అన్నారు. సీపీఎం ప్రజాచైతన్య యాత్రలో భాగంగా శనివారం ఆ పార్టీ నాయకులు అర్బన్ కాలనీలో పర్యటించి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. సిమెంటు రోడ్లు, సైడు కాలువలు నిర్మించకపోవడంతో మురుగునీరు ఇళ్ల ముందు నిలబడిపోయి కాలనీ వాసులు అవస్థలు పడుతున్నారన్నారు. అధికారులు స్పందించి అర్బన్ కాలనీలో అవసరమైన చోట డ్రైనేజి కాలువలు నిర్మించి సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సీపీఎం తరపున డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల నాయకుడు అన్వర్, తదితరులు పాల్గొన్నారు.

మోడల్‌స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

మార్కాపురం: మండలంలోని మిట్టమీదిపల్లి మోడల్ స్కూల్‌లో ఇంటర్మీడియెట్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ వేణుగోపాల్ తెలిపారు. మొదటి సంవత్సరం ప్రవేశాలకు ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపుల్లో ప్రవేశానికి పదో తరగతి పూర్తయిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఓసీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులకు రూ.200, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ.150 ఫీజు చెల్లించాలని తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 7416438378, 8985056837 నంబర్లను సంప్రదించాలని కోరారు.

చెత్తకు నిప్పు..కాలిపోయిన దిబ్బలు

రాచర్ల: మండల కేంద్రమైన రాచర్ల గ్రామ సమీపంలోని వెలిగొండ ప్రాజెక్టు కాలువ వద్ద చెత్త చెదారం పడేశారు. ఆ చెత్త చెదారానికి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో చెత్త కాలుకుంటూ పక్కనే ఉన్న బీసీకాలనీలోని చిల్లకంప చెట్లతో పాటు నాలుగు పేడదిబ్బలు పూర్తిగా కాలిపోయాయి. ఈ విషయాన్ని గమనించిన స్థానిక ప్రజలు వెంటనే ఫైర్ సిబ్బందికి సమాచారం అందించగా అగ్నిమాపక వాహనం వచ్చి మంటలను అదుపు చేశారు. ఎలాంటి ఆస్తి నష్టం జరగలేదని స్థానికులు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కొమరోలు: మండలంలో ఆదివారం విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లుగా విద్యుత్‌శాఖ ఏఈ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. కొమరోలులోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కోసం ఆదివారం ఉదయం 9 నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నామని, మండలంలోని ప్రజలు ఈవిషయాన్ని గమనించి విద్యుత్‌శాఖ సిబ్బందికి సహకరించాలని కోరారు.

వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

తర్లుపాడు: స్థానిక వేణుగోపాలస్వామి ఆలయంలో శనివారం రుక్మిణీసత్యభామ సమేత వేణుగోపాలస్వామికి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. స్వామి అమ్మవార్లకు ప్రత్యేకంగా అలంకరించి అష్టోత్తర పూజలు నిర్వహించారు.

అరకొర వసతులతో అవస్థలు



బెంచీలు లేక కంభం బస్టాండులో మండుటెండలో కింద కూర్చున్న ప్రయాణికులు



కాలంచెల్లిన బస్సులో వేలాడుతూ ప్రయాణం

- కంభం బస్టాండులో కనీస వసతులు కరువు
- మంచినీళ్లకు అల్లాడుతున్న ప్రయాణికులు
- కూర్చునేందుకు బెంచీలు కూడా లేని వైనం

కంభం:

ఆర్టీసీ అధికారులకు ఆదాయం పైన ఉన్న శ్రద్ధ కనీస సౌకర్యాలు కల్పించడంలో లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రయాణికులకు సరిపడా బస్సులు లేకపోవడంతో వారు ఉన్న ఆర్టీసీ బస్సుల్లో ప్రమాదకర ప్రయాణాలు చేస్తుంటే, కొందరు ప్రమాదమని తెలిసినా తప్పని పరిస్థితుల్లో ఆటోలను ఆశ్రయిస్తున్నారు. బస్సుల్లో ప్రథమ చికిత్సా కిట్స్ లేక, బస్సులకు కిటీలు, తలుపులు లేక అవస్థలు పడుతూ వేళాడుతూనే ప్రయాణాలు సాగిస్తున్నారు.

కంభం బస్టాండులో ప్రయాణికుల అవస్థలు:
ఇరుకుగా ఉండే కంభం బస్టాండులో ఓ వైపు దుకాణాలు, మరో వైపు పార్కింగ్ వాహనాలతో నిండిపోయి ఉంటుంది. ఉన్న కొద్దిపాటి షెల్టర్‌లో అరకొర బెంచీలు ప్రయాణికులకు సరిపోక ఎక్కువ మంది ఎండలో సైతం నేలపైనే కూర్చుంటున్నారు. ఫ్యాన్‌లు ఉన్నా ఉపయోగం లేదు. రోజు రోజుకూ ఎండలు పెరిగిపోతున్నా బస్టాండులో కనీసం మంచినీటి సౌకర్యం ఏర్పాటు చేయలేదు. దీంతో నిత్యం వందలాది మంది ప్రయాణికులు దాహంతో అల్లాడుతున్నారు.

బస్సులు మలుపుకోవడానికి ఇబ్బందులు:
బస్టాండు ఆవరణ చుట్టూ దుకాణాలు ఉండటం, ఖాళీ స్థలంలో ఆటోలు నిలుపుతుండటంతో బస్సులు మలుపుకోవడానికి డ్రైవర్లు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కాలంలో ట్రాఫిక్ సమస్యను నియంత్రించేందుకు పోలీసులు, పంచాయతీ అధికారులు బస్టాండు పరిసరాల్లో దుకాణాల ముందు మార్కింగ్ వేసి హెచ్చరించినా దుకాణదారుల్లో, వాహనదారుల్లో మార్పు రాకపోవడంతో సమస్య పరిష్కారం కావడం లేదు. ఆర్టీసీ అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

కరెంటు పోతే పనిచేయని ఏటీఎం:



బస్టాండు ప్రాంగణంలో కరెంటు పోతే పనిచెయ్యని ఏటియం

బస్టాండు ఆవరణలో ఏర్పాటు చేసిన ఓ ప్రైవేటు ఏటీఎంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రయాణికులు ఎవరైనా అవసరమై ఆ ఏటీఎంలోకి వెళ్తే కరెంటు ఉంటే డబ్బులు తీసుకోవచ్చు.. ఒక వేళ కరెంటు లేకపోతే మిషను పనిచేయడం లేదని వెనక్కి రావు. ట్రాన్సాక్షన్ జరుగుతున్న సమయంలో కరెంటు పోతే ఇక అంతే సంగతులు. రెండు రోజుల క్రితం రాచర్ల మండలానికి చెందిన ఓ ప్రయాణికుడు ఒంగోలుకు వెళ్తూ బస్టాండులోని ఏటీఎంలోకి వెళ్లి డబ్బులు తీసుకుంటున్న సమయంలో కరెంటు పోయింది. దాంతో అతని ట్రాన్సాక్షన్ ఆగిపోయింది. కొంత సేపటికి కరెంటు రాగా తిరిగి మిషన్లో నుంచి డబ్బులు రాలేదు అతని ఖాతాలోకి తిరిగి అవి జమ కాలేదు. ఎవరిని అడగాలో అర్థంకాని పరిస్థితిలో అతను అక్కడి నుంచి వెళ్లిపోయాడు.

బెల్టుషాపులపై ఎక్సైజ్ అధికారుల దాడులు

సాక్షి ఎఫెక్ట్..



కంభం ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకున్న మద్యం

కంభం: కభం పట్టణంలో, సమీప గ్రామాల్లో జోరుగా బెల్టు షాపులు నిర్వహిస్తున్న నేపథ్యంలో శనివారం సాక్షి దినపత్రికలో "మూడు క్వార్టర్లు... ఆరు పుల్లులు " అన్న శీర్షికతో వచ్చిన కథనానికి స్పందించిన కంభం ఎక్సైజ్ అధికారులు శనివారం ముమ్మరంగా దాడులు నిర్వహించారు. కంభం నుంచి నాగులవరం వెళ్లే దారిలో చికెన్ షాపు సమీపంలో బెల్టు షాపు పై దాడి చేసి 21 మద్యం సీసాలు స్వాధీనం చేసుకొని శ్రీనివాసులు అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. హైవే రోడ్డుపై ఓ రెస్టారెంట్ సమీపంలో బెల్టుషాపు పై దాడి చేసి 12 మద్యం సీసాలు స్వాధీనం చేసుకొని మండ్లా రాములు అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు, స్థానిక ఎస్‌బీఐ సమీపంలో మరొక బెల్టుషాపు పై దాడి చేసి 10 మద్యం సీసాలు స్వాధీనం చేసుకొని బల్లా లింగారెడ్డి అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ కొండారెడ్డి మాట్లాడుతూ ఎవరైనా బెల్టుషాపులు నిర్వహించినా, అక్రమ మద్యం తరలించినా, అక్రమంగా మద్యం కలిగి ఉన్నా చర్యలు తప్పవని హెచ్చరించారు.

రంగస్వామి ఆలయంలో బహిరంగ వేలంపాటలు



వేలంపాట నిర్వహిస్తున్న ఏవో మల్లావరపు నాగయ్య

రాచర్ల: మండలంలోని జేపీ చెరువు గ్రామ సమీపంలోని నల్లమల అటవీ ప్రాంతంలో వెలసిన నెమలిగుండ్ల రంగనాయకస్వామి దేవస్థానం సమీపంలోని లక్ష్మమ్మవనంలోని కల్యాణ మండపంలో వివిధ షాపులు నిర్వహించుకునేందుకు శనివారం దేవస్థానం కార్యనిర్వహణాధికారి మల్లావరపు నాగయ్య ఆధ్వర్యంలో బహిరంగ వేలంపాటలు నిర్వహించారు. టెంకాయలు అమ్ముకునేందుకు రూ.8,55,000, కొబ్బరి చిప్పలు పోగుచేసుకునే హక్కు కోసం రూ.1,81,000కు పాడుకున్నారు. తలనీలాలు పోగుచేసుకునే హక్కు కోసం ఎవరూ ఆసక్తి చూపకపోవడంతో ఈ పాటను వాయిదా వేసినట్లు కార్యనిర్వహణాధికారి మల్లావరపు నాగయ్య తెలిపారు. కార్యక్రమంలో పర్యవేక్షణ అధికారి బి.నాగమల్లేశ్వరరాజు, దేవస్థానం అర్చకుడు అన్నవరం సత్యనారాయణ చార్యులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో పింఛన్‌దారుల అవస్థలు



జీజీహెచ్‌లో వెరిఫికేషన్ కోసం వచ్చిన దివ్యాంగులు



వేచి ఉన్న వృద్ధులు

మార్కాపురం: కూటమి ప్రభుత్వం పింఛన్‌దారులకు పరీక్షలు పెడుతోంది. పరీక్షల నిమిత్తం దివ్యాంగులు, వృద్ధులు జీజీహెచ్‌కు వచ్చి గంటల తరబడి వేచి ఉంటూ ఇబ్బందులు పడుతున్నారు. మార్కాపురం జీజీహెచ్‌కు పలువురు పింఛన్‌దారులు డాక్టర్ల వద్ద పరీక్షలు చేయించుకునేందుకు వస్తున్నారు. మార్కాపురం పట్టణ, రూరల్, తర్లుపాడు, కొనకనమిట్ల, పెద్దారవీడు, పెద్దదోర్నాల తదితర మండలాల నుంచి పలువురు పింఛనుదారులు, దివ్యాంగులు పింఛన్ వెరిఫికేషన్ కోసం వస్తూ ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వంలో అన్నీ తనిఖీ చేసి అధికారులు పింఛన్ ఇవ్వగా మళ్లీ వీరిని తనిఖీ నిమిత్తం వైద్యశాలల చుట్టూ తిప్పడం విమర్శలకు తావిస్తోంది.

పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలి

గిద్దలూరు రూరల్: ప్రతి ఒక్కరూ పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని స్థానిక ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణంలోని గాం. దీబొమ్మసెంటర్, పొట్టిశ్రీరాముల సెంటర్, మార్కెట్ రోడ్డుల్లో నగర పంచాయతీ సిబ్బందితో కలిసి ఎమ్మెల్యే అవగాహన ర్యాలీ నిర్వహిస్తూ స్వచ్ఛత పై ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలోని ప్రతి ఒక్కరూ పరిశుభ్రతపై పూర్తిగా శ్రద్ధ చూపాలన్నారు. పట్టణంలోని పశుసంవర్ధకశాఖ కార్యాలయంలో ఏడీఏ డా.యోగానంద తన సిబ్బందితో కలిసి పరిసరాలను శుభ్రం చేశారు. స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో సహాయ వ్యవసాయ సంచాలకులు బాలాజీనాయక్, ఏఓ విజయభాస్కర్‌రెడ్డిల ఆధ్వర్యంలో కార్యాలయంలోని పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో చైర్మన్ పాముల వెంకటసుబ్బయ్య, కమిషనర్ ఐ.శ్రీనివాసులు, తహశీల్దార్ ఎం.ఆంజనేయరెడ్డి, కౌన్సిలర్లు, నగర పంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

తర్లుపాడు: మండలంలోని లింగారెడ్డి కాలనీ ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం మౌలాలి ఆధ్వర్యంలో స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సహోపాధ్యాయుడు ఎస్‌కే షెక్షావలి పాల్గొన్నారు.

ఆత్మహత్యకు పాల్పడిన యువకుడు చికిత్స పొందుతూ మృతి

కంభం: లాడ్జిలో పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడిన ఓ యువకుడు ఒంగోలులో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు కంభం ఎస్సై నరసింహారావు తెలిపారు. వివరాలు ..బాపట్ల జిల్లా ఇంకొల్లు మండల భీమవరం గ్రామానికి చెందిన కొమటి గుంట శ్రీనివాసులు (22) వ్యాపారం కోసం కంభం వచ్చి ఈనెల 9న పట్టణంలోని కాలే లాడ్జిలో గది అద్దెకు తీసుకొని వ్యాపారం చూసుకుంటున్నాడు. ఈ నేపథ్యంలో ఈనెల 13వ తేదీ రాత్రి లాడ్జిలో పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడగా వెంటనే అతన్ని వెంకటేశ్వర హాస్పిటల్ కు తరలించి చికిత్స అందించారు. సమాచారం అందుకున్న తల్లిదండ్రులు కంభం చేరుకొని పరిస్థితి విషమంగా ఉన్న గుంట శ్రీనివాసులును ఒంగోలులోని ప్రైవేటు వైద్యశాలకు తీసుకెళ్లారు. శుక్రవారం రాత్రి అక్కడ నుంచి రిమ్స్‌కు తీసుకెళ్తుండగా మార్గం మధ్యలో చనిపోయినట్లు సమాచారం వచ్చిందని పోలీసులు తెలిపారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

ప్లాస్టిక్ భూతాన్ని తరిమేద్దాం



మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ త్రివినాగ్



ర్యాలీలో పాల్గొన్న కళాశాల సిబ్బంది

మార్కాపురం: ప్లాస్టిక్ భూతాన్ని తరిమేసి పర్యావరణ పరిరక్షణకు కృషి చేద్దామని సబ్‌కలెక్టర్ త్రివినాగ్, ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. పట్టణంలో స్వచ్ఛాంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణంలోని గడియార స్తంభం సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిలిపివేయాలన్నారు. ప్లాస్టిక్ వాడకంతో పర్యావరణ కాలుష్యంతో పాటు జంతువులు వాటిని తిని మృత్యువాత పడుతున్నాయన్నారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. మున్సిపల్ కమిషనర్ నారాయణరావు, బీజేపీ ఇన్‌చార్జి కృష్ణారావు, పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

మార్కాపురం: ప్లాస్టిక్ వాడకంతో ఎన్నో అనర్థాలు ఉన్నాయని కిట్స్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వెన్న కృష్ణారెడ్డి అన్నారు. ప్లాస్టిక్ వాడకం వల్ల వచ్చే అనర్థాలపై శనివారం కళాశాలలో విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్లాస్టిక్ బ్యాగ్‌లు, కవర్లు నిషేధించాలని, ఆహార పదార్థాలు ప్లాస్టిక్ కవర్లలో తీసుకెళ్లకుండా సంచులను వాడాలని సూచించారు. ప్లాస్టిక్ బ్యాగుల స్థానంలో తాటి ఆకులు, జూట్ బ్యాగులు, వస్త్ర సంచులను ఉపయోగించాలని, మట్టి, కంచు, ఉక్కు, గాజు పాత్రలు వాడాలన్నారు. పీవీ అనీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సూర్య, చంద్ర వాహనాలపై శ్రీవారి ఉత్సవం



చంద్ర వాహన ఉత్సవం

కొనకనమిట్ల: వెలుగొండ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం ఉదయం, సాయంత్రం శ్రీలక్ష్మీ అలివేలుమంగ వెంకటేశ్వర స్వామి వార్లను సూర్య, చంద్ర వాహనాలపై ఉత్సవం నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన శ్రీవారి ఉత్సవ మూర్తులను వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య మేళతాళాలతో వెలుగొండ పురవీధులలో ఊరేగించారు. అడుగడుగునా భక్తులు స్వామికి వారు పోసి నైవేద్యాలు సమర్పించారు. ముందుగా వేదపండితులు ప్రసాదాచార్యులు, భార్గవాచార్యులు ఉత్సవ మూర్తులకు అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. జవ్వాజి వెలుగొండయ్య, శ్రీనివాసులు, వెలుగొండయ్య, సుబ్బయ్య, సత్యం, క్రిష్ణ, నాగేశ్వరరావు, సత్యన్నారాయణ, వీరనారాయణ, అప్పారావు, భాస్కరరావు తదితరులు కార్యక్రమానికి ఉభయదాతలుగా వ్యవహరించారు. ఉత్సవాలు ఆలయ ఈఓ చెన్నకేశవరెడ్డి, కమిటి సభ్యులు కాశిరెడ్డి పర్యవేక్షణలో కొనసాగాయి. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన కోలాటం అలరించింది.



అలరించిన మహిళల కోలాటం

భక్తిశ్రద్ధలతో అయ్యప్పస్వామి జన్మదిన వేడుకలు



అయ్యప్పస్వామి ఆలయలంలో పూజలు నిర్వహిస్తున్న ఉడుముల, ఎంపీపీ

కొనకనమిట్ల: అయ్యప్పస్వామి పుట్టిన రోజును పురస్కరించుకొని చినారికట్లలోని అయ్యప్పస్వామి ఆలయంలో ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణ యాదవ్ ఆధ్వర్యంలో పూజలు చేశారు. అయ్యప్పస్వామి నగరోత్సవంలో మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులరెడ్డి పాల్గొని ముందుగా అయ్యప్పస్వామికి అభిషేకాలు, అర్చనలు, అమృతాభిషేకం జరిపించారు. ఆలయ కమిటీ నిర్వాహకులు ఉడుముల గురవారెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, రామనారాయణ రెడ్డి, జెడ్పీటీసీ అక్కిదాసరి ఏడుకొండలు,, సర్పంచ్ గోసుల అనురాధ, ఎంపీటీసీ ఉడుముల ధనలక్ష్మి, బంగారురెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మోరా శంకర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం కన్వీనర్ ఏలూరి సంజీవరెడ్డి, సూరవరపు పెదవెంకటరెడ్డి, ఎంఆర్‌ఎఫ్ వెంకటేశ్వరరెడ్డి, సోషల్ మీడియా కో ఆర్డినేటర్లు బ్రహ్మారెడ్డి పాల్గొన్నారు.

కాటమరాజు తిరునాళ్ల ఏర్పాట్లపై సమావేశం

బేస్తవారిపేట: వేనూతల కాటంరాజు గంగాభవాని తిరునాళ్ల మహోత్సవ ఏర్పాట్లపై, వేలంపాట ఆదివారం ఉదయం చింతగుంట్ల ఆంజనేయస్వామి ఆలయంలో నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ పీ వెంకటరాజు తెలిపారు. వేలంపాట నిర్వహణ, నిర్మాణంలో ఉన్న భోజనశాలకు నిధుల సమీకరణ, అన్నసంతర్పణ ఏర్పాట్లపై చర్చిస్తారన్నారు. ఆలయ కమిటీ సభ్యులు, యాదవ సంఘం పెద్దలు, ఆచార గ్రామపెద్దలు, పూజారులు, సేవా సమితి సభ్యులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

సైకిల్‌పై సబ్‌కలెక్టర్



సైకిల్‌పై వస్తున్న సబ్‌కలెక్టర్ త్రివినాగ్

మార్కాపురం: ఆయనొక ఐఏఎస్ అధికారి.. ప్రభుత్వ కారు, అధికార హోదా అన్నీ ఉన్నాయి.. అవన్నీ వదిలిపెట్టి సైకిల్‌పై ప్రభుత్వ కార్యక్రమానికి వచ్చి అందరినీ ఆశ్చర్యపరచడంతో పాటు ఆదర్శంగా నిలిచారు. మార్కాపురం సబ్‌కలెక్టర్ సహదిత్ వెంకట త్రివినాగ్ శనివారం పట్టణంలోని పాతబస్టాండ్‌లో స్వచ్ఛఆంధ్ర-స్వచ్ఛదివస్‌లో పాల్గొనేందుకు తర్లుపాడు రోడ్డులోని తనబంగ్లా నుంచి సాధారణ వ్యక్తి లాగా సైకిల్‌పైవచ్చి కార్యక్రమంలో పాల్గొన్నారు. దీంతో అక్కడ ఉన్న ప్రభుత్వ అధికారులంతా ఆశ్చర్యపోయారు. వారంలో ఒక్కరోజైనా కాలుష్యాన్ని నివారించేందుకు సైకిల్ వాడాలని తెలిపారు.

ఇఫ్తార్ విందులో మాజీ ఎమ్మెల్యేలు





మాజీ ఎమ్మెల్యేలు కేపీ నాగార్జునరెడ్డి, అన్నా రాంబాబులను సత్కరిస్తున్న నిర్వాహకులు, నాయకులు

కంభం: ఎంజీ బ్రదర్స్ ఆధ్వర్యంలో స్థానిక కూరగాయల మార్కెట్‌లో శనివారం సాయంత్రం మండలంలోని ముస్లింలకు ఘనంగా ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. 20 ఏళ్లుగా రంజాన్ మాసంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేస్తున్నట్లు యంజీ బీఈడీ కళాశాల కరస్పాండెంట్ గఫార్ అలిఖాన్ తెలిపారు. మార్కాపురం, గిద్దలూరు మాజీ ఎమ్మెల్యేలు కేపీ నాగార్జునరెడ్డి, అన్నా వెంకట రాంబాబు ఇఫ్తార్ విందుకు హాజరుకాగా వారిని శాలువాతో సత్కరించి స్వాగతం పలికారు.

వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకులు షంషీర్ అలి బేగ్, కేవీ రమణారెడ్డి, కంభం మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్‌లు నెమలిదిన్నె చెన్నారెడ్డి, యేలం వెంకటేశ్వర్లు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గొంగటి చెన్నారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ డిష్ మున్నా, సర్పంచ్ పల్నాటి బోడయ్య, ఉపసర్పంచ్ సయ్యద్ ఖాసిం తదితరులు ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు.

వినియోగదారుల చట్టంపై అవగాహన అవసరం

పొదిలి రూరల్: ప్రజలకు వినియోగదారుల చట్టంపై అవగాహన పెంచుకుంటే మోసపోకుండా జాగ్రత్త పడవచ్చని ఎంపీడీఓ జి.శోభన్‌బాబు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన ప్రపంచ వినియోగదారుల దినోత్సవంలో ఆయన మాట్లాడారు. వినియోగదారులు తమకు తెలియకుండానే పలు చోట్ల మోసాలకు గురువుతున్నారన్నారు. కార్యక్రమంలో పొదిలి సీపీసీ అధ్యక్షుడు డి. రామారావు, ఎంఈఓ-2 నాగలక్ష్మి పాల్గొన్నారు.